క్లుప్తంగా

మోటార్లలో కేబుల్ వైరు చోరీ

గుడ్లూరు: పొలాల్లో మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి, ఈ సంఘటన మండలంలోని దారకానిపాడులో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన నరశింగరావు, మోహన్, జాన్ మరో ఇద్దరు రైతులు మన్నేరు ఒడ్డున ఉన్న తమ పొలాల్లో వరినార్లు పోసారు. ఆదివారం ఉదయం వారు నార్లును పరిశీలించడానికి పొలాల వద్దకు వెళ్లగా అక్కడ ఐదు విద్యుత్ మోటార్లుకు ఉన్న కేబుల్ వైర్లు అపహరణకు గురైనట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు పడి కేబుల్ వైరును చోరీ చేసి ఉంటారని రైతులు తెలిపారు. ఒక్కో మోటార్‌కు ఉన్న కేబుల్ వైరు విలువ రూ.5 వేలు అని బాధితులు తెలిపారు. ఇటీవల పొలాల్లో తరుచూ విద్యుత్ మోటార్లలో ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురి అవుతున్నాయని, దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

రేపు ఆయకట్టు రైతుల సమావేశం

పామూరు: మండలంలోని మీడియం ఇరిగేషన్ రిజర్వాయర్ మోపాడు బంగ్లావద్ద రేపు మంగళవారం ఉదయం 10 గంటలకు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని రైతుల సమావేశం నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మీరెడ్డి తెలిపారు. సమావేశానికి మోపాడు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని పామూరు మండలం, నెల్లూరుజిల్లా కొండాపురం మండలాల రైతులు హాజరుకావాలన్నారు. సమావేశంలో పంటల సాగుకు రిజర్వాయర్ నీటి విడుదలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

అంకమ్మతల్లికి గాజుల అలంకారం


గాజుల అలంకారంలో అంకమ్మతల్లి

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలు వైభవంగా సాగుతున్నాయి. పూజల్లో భాగంగా అమ్మవారు ఆదివారం గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రంగుల గాజులతో చేసిన అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

గుడ్లూరులో భారీ వర్షం


గుడ్లూరు బీసీ కాలనీలో ప్రవహిస్తున్న వర్షం నీరు

గుడ్లూరు: ఈశాన్య రుతుపవనాలు ప్రభావంతో మండలంలోని పలు గ్రామాలలో నాలుగు రోజులు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో, గుడ్లూరులో భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని పలు కాలనీల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు పడుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట పొలాల్లో మెట్ట పంటలు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. అలాగే బోర్లు కింద వరి నార్లు పోయడానికి కూడా దుక్కులు దున్నుతున్నారు. మొత్తం మీద వర్షాలు పడుతుండంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

8న జగనన్నకు చెబుదాం

కందుకూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ఈ నెల 8వ తేదీ కందుకూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వాస్తవానికి 8వ తేదీ అల్లూరులో ఈ కార్యక్రమం జరగాల్సి ఉన్నా అక్కడ రద్దు చేసి అల్లూరుకు బదులుగా కందుకూరులో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని, అన్ని శాఖల ఉన్నతాధికారులు ఆ రోజు అందుబాటులో ఉంటారని తెలిపారు.

వర్షంతో జీవం పోసుకున్న పంటలు

మర్రిపూడి: మండలంలోని రేగలగడ్డ, మర్రిపూడి, వల్లాయపాలెం, దుగ్గిరెడ్డిపాలెం గంగపాలెం తదితర గ్రామాలల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో మిరప, పొగాకు, మినుము, సజ్జ, కంది తదిర పంటలు జీవం పోసుకున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షం లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో వర్షం రైతులకు ఊరటనిచ్చింది. కొందరు రైతులు లేత పొగనారు తీసుకొచ్చి నాట్లు వేస్తున్నారు. ముదురు పొగమొక్కలు, మినుము పంటలకు ఈ వర్షం జీవం పోసింది.

అర్హులంతా ఓటుకు నమోదు చేసుకోవాలి


పామూరులో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ


సీఎస్‌పురంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్


వల్లూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు


బొట్లగూడూరులో ఓటర్లజాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

పామూరు: మండలంలోని 18 ఏళ్లు నిండిన వారంతా నూతనంగా ఓటుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఆర్‌ఓ శ్రీనివాసరావు అన్నారు. పామూరుతో పాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లర్లు జాబితాలో తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తులు తీసుకుని సవరించాలన్నారు. అదేవిధంగా శాశ్వత వలసదారులు, డెత్ కేసులకు సంబంధించి నిర్దేశిత ధ్రువపత్రాలను తీసుకుని ఓట్ల తొలగింపుకు సిఫార్సు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రసాద్, బీఎల్‌ఓలు షరీఫ్, మురళి, గాయత్రి, శ్రీదేవి పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా అన్నారు. సీఎస్‌పురంతోపాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రత్యేకక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఓటునమోదుకోసం, సవరణకోసం, తలగింపులకోసం వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్ల వారితో బీఎల్‌ఓలు విధిగా నూతన ఓటుకోసం దరఖాస్తులు చేయించాలన్నారు. షేక్.బజాజ్ బుజ్జి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని 18 ఏళ్లు నిండిన వారంతా నూతనంగా ఓటుకోసం దరఖాస్తు చేసుకోవాలని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. మండలంలోని బొట్లగూడూరు పోలింగ్‌బూత్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తులు తీసుకుని సవరించాలన్నారు.

అదేవిధంగా శాశ్వత వలసదారులు, డెత్ కేసులకు సంబంధించి నిర్దేశిత ధృవపత్రాలను తీసుకుని ఓట్ల తొలగింపుకు సిఫార్సు చేయాలన్నారు. బీఎల్‌ఓలు పారదర్శక ఓటర్లజాబితా రూపకల్పనకు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈఆర్‌ఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు ప్రసాద్, బీఎల్‌ఓలు షరీఫ్, మురళి, గాయత్రి, శ్రీదేవి పాల్గొన్నారు.

కొత్త ఓట్ల నమోదుపై దృష్టి సారించండి

టంగుటూరు: కొత్త ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని వల్లూరు, సూరారెడ్డిపాలెం పోలింగ్ కేంద్రాలను ఆదివారం జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ-2024లో భాగంగా 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ క్యాంపుల్లో ముసాయిదా ఓటర్ల జాబితాతో బీఎల్వోలు అందుబాటులో ఉండాలన్నారు. ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి నారదముణి, తహసీల్దార్ సంజీవరావు, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ విజయవంతం

సింగరాయకొండ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా శని, ఆదివారాల్లో తలపెట్టిన ఓటు స్పెషల్ డ్రైవ్ విజయవంతమైందని కొండపి ఈఆర్‌ఓ నారదముని పేర్కొన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పానుగోటివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈఆర్‌ఓ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించానని, ప్రజల నుంచి స్పందన బాగుందని చెప్పారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, వీఆర్‌ఓ మాధవి పాల్గొన్నారు.


అనకర్లపూడిలో బీఎల్‌ఓకు సూచనలిస్తున్న తహసీల్దార్ శింగారావు


మూలగుంటపాడు పంచాయతీ పానుగోటివారిపాలెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి(సింగరాయకొండ): ఓటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తహసీల్దార్ సింగారావు తెలిపారు. కొండపి మండలంలో ఆదివారం ఓటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. అనకర్లపూడి, నెన్నూరు, ముప్పవరం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ఓటరు జాబితాలో సవరణకు ప్రజల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. ఆయన వెంట వీఆర్‌ఓలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గోపూజ


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో గోపూజ నిర్వహించారు. అదేవిధంగా వేకువజామున శ్రీనారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న కమిటీ, భక్తులు

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లిలో పోలేరమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాల అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకుడు శ్రీనివాస శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్ దేవస్థానం చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజారక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ


ఉలవపాడులో ప్రజారక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు: సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి బస్‌యాత్ర పోస్టర్‌ను ఆదివారం ఉలవపాడులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడుకుమార్ మాట్లాడుతూ లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు యాత్ర గత నెల 30 న ఆదోనిలో ప్రారంభమై సోమవారం సాయంత్రం కందుకూరు కు వస్తుందని తెలిపారు. కందుకూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈనెల 15న విజయవాడలో భారీ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మాజీ ఎంపీ పి.మధు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రజలు హాజరుకావాలని కోరారు.

గంగమ్మ తల్లికి పూజలు


గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండల పరిధిలోని చిన్న గుడిపాడులో గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా పడాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని గంగమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లిని గ్రామంలోని వీధుల్లో కొమ్ము బూరాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో మహిళలు వారు పోసి ఊరేగింపునకు స్వాగతం పలికి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుకట్ట వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను గ్రామ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం


లింగసముద్రంలో నిర్వహించిన అమ్మవారి గ్రామోత్సం

లింగసముద్రం: స్థానిక లింగమక్కమ్మతల్లి గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీలోని బలిజపాలెంలోని లింగమక్కమ్మతల్లి పుట్టిల్‌లైన అడపా శ్రీనివాసులు ఇంటి నుంచి పసుపు కుంకుమలు మేళతాళాలలో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి పూజలు నిర్వహించారు. వర్షాలు సక్రమంగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు.

వంగపాడులో మసీదు ప్రారంభం


ముస్లింలతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: మండలంలోని వంగపాడులో నూతనంగా నిర్మించి మసీదు ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రావుల తిరుపతయ్య, పాశం కొండయ్య, నాయకులు సిద్ధారెడ్డి, వెంకటరెడ్డి, రమేష్, గురుస్వామి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

రాచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రాచర్ల ఫాం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. అనుములపల్లె గ్రామానికి చెందిన బి.రంగనాయకులు అనే వ్యక్తి తన బైకుపై గిద్దలూరు నుంచి అనుములపల్లె గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో గిద్దలూరుకు బైకుపై వెళ్తున్న గుర్తుతెలియని మరో వ్యక్తి రాచర్ల ఫాం గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొనడంతో రంగనాయకులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై ఆదిశేషయ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


హెచ్‌ఎంపాడులో గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: హనుమంతునిపాడులో గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమంతునిపాడులో గంగమ్మ తల్లి నూతన గుడి ఏర్పాటు నూతన విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగి నెల రోజులు పూర్తి కావడంతో ఆదివారం గంగమ్మతల్లికి ప్రత్యేక పొంగళ్లు పెట్టి అమ్మవారికి ప్రసాదం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని బురుజుపల్లె గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. బురుజుపల్లె గ్రామం నుంచి మహిళా కూలీలతో వస్తున్న లగేజీ ఆటోను ముండ్లపాడు గ్రామానికి చెందిన శిరిగిరి తేజ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శిరిగిరి తేజ, లగేజీ ఆటోలో ప్రయాణిస్తున్న శింగపల్లెకు చెందిన మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

అనాథ మహిళకు ఆర్థిక సహాయం

పెద్దదోర్నాల: మండల కేంద్రానికి చెందిన నిరుపేద అనాథ మహిళకు మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముంతాజ్ అనే నిరుపేద మహిళకు గ్రైండర్, కుట్టుమిషన్‌లతో పాటు బియ్యం, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమద్, సెక్రటరీ ఖాసిం, జాయింట్ సెక్రటరీ మహబూబ్‌బాషా, ట్రెజరర్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోం పిల్లలకు బుక్స్ అందజేత


చిల్డ్రన్స్‌హోంలో పిల్లలకు బుక్స్ అందజేస్తున్న దాత అంచూరి వెంకటరెడ్డి

పామూరు: చిల్డ్రన్స్‌హోం పిల్లలకు దాతలు బుక్స్ సమకూర్చి అందజేయడం అభినందనీయమని సంస్థ అధ్యక్షుడు నూనె వేణి, ప్రసాద్ అన్నారు. పామూరు లార్డ్ స్వచ్ఛందసంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన దాత అంచూరి వెంకటరెడ్డి తన సొంతనిధులతో హోంలోని అనాథ పిల్లలకు నోట్‌బుక్స్, కాపీరైటింగ్‌బుక్స్, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. దాతలకు వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, వేణి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ


హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్

కనిగిరి రూరల్: పట్టణంలోని సుభాష్‌రోడ్డులో ఉన్న బీసీ-2 హాస్టల్‌ను ఆదివారం చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డిలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్లు హాస్టల్ అధికారులతో మాట్లాడి మెనూ వివరాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారాన్ని నాణ్యమైన ఆహారాన్ని అందచేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పన గురించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లోని అన్ని గదుల్లో లైట్లు, ఫ్యాన్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని హాస్టల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి, పలు సూచనలు చేశారు.

విశ్వరూప మహాసభ కరపత్రాల ఆవిష్కరణ


వీరేపల్లిలో విశ్వరూప సభ కరపత్రాల ఆవిష్కరణ

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లిలో మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఎంఈఎఫ్ కందుకూరు నియోజకవర్గ అధ్యక్షులు జడరాములు వీటిని ఆవిష్కరించారు. ఈ నెల 11 న హైదరాబాద్‌లో జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ ను విజయవంతం చేయాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాలనే నినాదంతో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొంటారన్నారు. ఉలవపాడు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ ప్రకాశంజిల్లా ఉపాధ్యక్షుడు నిరంజన్‌మాదిగ, కందుకూరు నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జి రావినూతల ముత్తు తదితరులు పాల్గొన్నారు.